సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 25 । ఆగస్టు । 2024



1 నుంచి సభ్యత్వ నమోదు

సెప్టెంబర్ 1 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు తెలిపారు.

- 8లో ▸



ఆర్థికంగా ఎదగాలి

స్వయం ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఎస్బీఐ ఆర్ ఎస్ఈటీఐ డైరెక్టర్ విశ్వనాథ్‌రెడ్డి అన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.2 /21.9

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ శివప్రసాద్



నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ కె శివప్రసాద్‌ను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ నాగమోహన్ వ్యవహరించగా, సీనియర్ హెచ్‌వోడీ కావడంతో డాక్టర్ శివప్రసాద్‌ను పూర్తిస్థాయి అదనపు బాధ్యతల్లో ప్రిన్సిపల్‌గా కొనసాగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. 2018 నుంచి సైకియాట్రిక్ విభాగం హెచ్‌వోడీగా విధులు నిర్వహిస్తున్న నాగమోహన్.. గతంలో సూపరింటెండెంట్‌గా అవకాశం వచ్చినా సున్నితంగా తిరస్కరించినట్లు తెలిసింది. సెప్టెంబర్‌లో పదోన్నతి ఉండడంతో సీనియారిటీ జాబితాలో డాక్టర్ కె శివప్రసాద్ ముందు వరుసలో ఉన్నారు. రెండుమూడు రోజుల్లో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఎస్సారెస్పీలోకి పోటెత్తిన వరద



బాల్కొండ: ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి వరద పోటెత్తింది. ఇన్‌ఫ్లో శనివారం ఉదయం 12 వేల క్యూసెక్కులకు పెరగగా, మధ్యాహ్నానికి 25 వేలకు, సాయంత్రానికి 30 వేల క్యూసెక్కులకు పెరిగింది. దీంతో ప్రాజెక్ట్ నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 541 క్యూసెక్కుల నీరు పోతోంది. మిషన్ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని వాడుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా, శనివారం సాయంత్రానికి 1082.30 (51.62 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

పార్లమెంట్‌లో సేవాలాల్ విగ్రహం



సుభాష్‌నగర్: బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని పార్లమెంట్ ఆవరణలో ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు. జిల్లాకేంద్రంలోని అమ్మనగర్ కాలనీలో ఉన్న ఎస్ఆర్‌కే ఫంక్షన్‌హాలులో ఎంపీ అర్వింద్‌ను బంజారా సమాజం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సన్మానించారు. బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బిలోజీ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అర్వింద్ మాట్లాడుతూ.. బంజారా సోదరుల అండదండలు తనకు ఎల్లప్పుడూ ఉంటాయని, ప్రతిఒక్కరూ సేవాలాల్ మహరాజ్ ఆశయ సాధన కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. మహబూబాబాద్ మాజీ ఎంపీ సీతారాంనాయక్, నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, బంజారా నాయకులు బద్యానాయక్, డాక్టర్ రమేశ్ నాయక్, హరిచంద్ కేతావత్, రాథోడ్ సుందర్‌సింగ్, బాలు నాయక్, పవార్ సోను ప్రకాశ్, రమేశ్ మహరాజ్, నారాయణ మహరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ సస్పెన్షన్

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ఆర్‌యూబీ (రైల్వే కమాన్) వద్ద వరద నీటిలోకి బస్సును తీసుకెళ్లిన డ్రైవర్ సాంబయ్యను ఆర్టీసీ అధికారులు సస్పెండ్ చేశారు. ఈ నెల 19న హైదరాబాద్ నుంచి నిజామాబాద్ బస్టాండ్‌కు వస్తున్న బస్సును ఆర్ యూబీ వద్ద వరద నీటిలో నుంచి నడిపేందుకు ప్రయత్నించగా, ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. బస్సులో మొత్తం 50 మంది ఉండగా 10 వరకు పిల్లలు ఉన్నారు. ట్రాఫిక్ పోలీసులు, పోలీసులు ప్రయాణికులను వరద నీటిలో నుంచి సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఈ ఘటనపై విచారణ నివేదిక ఆధారంగా డ్రైవర్ సాంబయ్యపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలిసింది. ఆర్ఎం జానీరెడ్డి వివరణ కోరగా డ్రైవర్‌పై చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.



తీర్మానాలు..

జేఏసీ నాయకులు రైతులతో చర్చించి పలు తీర్మానాలు చేశారు.

- షరతులు లేకుండా ఏక కాలంలో ప్రతి రైతుకు రూ. రెండు లక్షల రుణమాఫీ చేయాలి.
- రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఇవ్వాలి.
- వరి పంటకు రూ.500 బోనస్ ఇవ్వాలి.

రాజకీయ నాయకులు రావొద్దు

పంటలు పండించడానికి వర్షం కోసం ఆకాశం వైపు చూసే రైతులం సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నమ్మి రుణ మాఫీ కోసం ఎదురు చూసే దుస్థితికి వచ్చాం. భవిష్యత్తులో రైతులు చేసే ఉద్యమాలకు రాజకీయ నాయకులు హాజరు కావొద్దు.

- ధర్నాలో పలువురు రైతు నాయకుల ఆగ్రహం

మామిడిపల్లి వద్ద భారీ సంఖ్యలో రోడ్డుపై బైఠాయించిన రైతులు

రుణ సంకెళ్లు తెంచండి

షరతులు లేకుండా ప్రతి రైతుకు రూ. రెండు లక్షల రుణమాఫీ చేయాలి

ఆర్మూర్‌లోని మామిడిపల్లి వద్ద రైతన్నల భారీ నిరసన.. రోడ్డుపై బైఠాయింపు

ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాల నుంచి హాజరు

అడగకున్నా రుణ మాఫీ చేస్తామని వరంగల్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ నాయకులు ప్రకటించారు

మోసం చేస్తే సీఎం రేవంత్ రెడ్డిని.. ఆయన ఒట్టేసిన దేవుళ్లు, నమ్మిన రైతులు వదిలి పెట్టరు

వచ్చే నెల 15 లోగా రుణ మాఫీ చేయకుంటే అసెంబ్లీ ముట్టడి

స్పష్టం చేసిన రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు

సంఘీభావం ప్రకటించిన బీజేపీ, బీఆర్ఎస్, టీడీపీ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు

ఆర్మూర్ : షరతులు లేకుండా ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణ మాఫీ చేసి, రుణ సంకెళ్ల నుంచి విముక్తి కల్పించాలని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేసారు. ఆర్మూర్ పట్టణం మామిడిపల్లి శివారులోని రైల్వే బ్రిడ్జి సమీపంలో ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాలకు చెందిన రైతులు రాజకీయాలకు అతీతంగా రోడ్డుపై బైఠాయించి శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు.

రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు వి ప్రభాకర్, ఇట్టెడి లింగారెడ్డి, దేగాం యాదగౌడ్, నూతుల శ్రీనివాస్ రెడ్డి, తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులు అడగకున్నా వరంగల్ డిక్లరేషన్ అంటూ కాంగ్రెస్ నాయకులు రూ.రెండు లక్షల రుణ మాఫీని ప్రకటించారన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక ఖజానా ఖాళీ ఉందంటూ, ఎన్నికల కోడ్ అంటూ రైతులను మోసం చేసే కుట్ర చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. రైతులందరికీ రూ.49 వేల కోట్ల రుణ మాఫీ చేస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన ఒట్టేసిన దేవుళ్లు, నమ్మిన రైతులు క్షమించరన్నారు. ఏక కాలంలో రైతు రుణమాఫీ చేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి దాటవేయడంపై మండిపడ్డారు.

డెడ్ లైన్ - సెప్టెంబర్ 15

ఆగస్టు 15వ తేదీ లోగా రైతుల రుణ మాఫీ పూర్తి చేస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులనెదుర్కొంటున్నారని రైతు జేఏసీ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేసారు. వచ్చే నెల 15వ తేదీ లోగా ప్రతి రైతుకు రుణ మాఫీ చేయని పక్షంలో రైతు జేఏసీ ఆధ్వర్యంలో భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించుకొని అసెంబ్లీ ముట్టడిని సైతం చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ ప్రాంత రైతాంగం చేపట్టిన ఉద్యమాలను వివరించారు. భవిష్యత్తులో రైతులు చేసే ఉద్యమాలకు రాజకీయ నాయకులు హాజరు కావద్దంటూ పలువురు రైతు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేసారు.

వివిధ పార్టీల నాయకుల సంఘీభావం..

ఆర్మూర్‌లో రైతులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యేలు ఆశన్నగారి జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, బీజేపీ నిజామాబాద్ పార్లమెంట్ నియోజవర్గ ఇన్‌చార్జి పల్లె గంగారెడ్డి, పెద్దోళ్ల గంగారెడ్డి ధర్నా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.

అనంతరం రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు ఆర్మూర్ ఆర్డీవో రాజా గౌడ్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు బి దేవరాం, వెల్మల్ రాజన్న, సుక్కి సుధాకర్, ఆర్గుల్ సురేష్, జైడి భాస్కర్, నక్కల భూమారెడ్డి, కె రాజారెడ్డి, మంథని నవీన్ రెడ్డి, తనుజా రెడ్డి, విజయ లక్ష్మి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి, జీవన్‌రెడ్డి



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు ప్రభాకర్, తదితరులు

భారీ బందోబస్తు



మామిడిపల్లి బైపాస్ చౌరస్తా వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

పెర్కిట్(ఆర్మూర్): రైతుల నిరసన కార్యక్రమానికి పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. సుమారు నాలుగు వేల మంది రైతులు స్వచ్ఛందంగా తరలి రాగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు నిజామాబాద్‌తో పాటు నిర్మల్, జగిత్యాల జిల్లాల నుంచి సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వు, స్పెషల్ పార్టీకి చెందిన పోలీసులను మోహరించారు. ఏసీపీ బస్వారెడ్డి ఆధ్వర్యంలో ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో రవి కుమార్, ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి, భీంగల్ సీఐ నవీన్ బందోబస్తును పర్యవేక్షించారు. రైతులు 44వ నంబరు జాతీయ రహదారిపై రాస్తారోకో చేసే అవకాశం ఉన్నందున ట్రాఫిక్‌ను మళ్లించడానికి పోచంపాడ్, డిచ్‌పల్లి వద్ద సైతం పోలీసులను మోహరించారు. రైతులు చేపట్టిన సమావేశం ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

సమస్య, పరిష్కారం ఒకే దగ్గర ఉంటాయి

- హైకోర్టు జస్టిస్ సుజోయ్ పాల్
- కమ్యూనిటీ మీడియేటర్లకు ముగిసిన శిక్షణ

ఖలీల్‌వాడి: సమస్య, పరిష్కారం ఒకే దగ్గర ఉంటాయని హైకోరు జడ్జి, తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యనిర్వాహక చైర్మన్ జస్టిస్ సుజోయ్ పాల్ అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్‌లో మూడు రోజులపాటు కొనసాగిన కమ్యూనిటీ మీడియేటర్స్ శిక్షణ శనివారం ముగిసింది. కార్యక్రమానికి న్యాయమూర్తి సుజోయ్ పాల్ హాజరై మాట్లాడారు.. ఇద్దరి మధ్య తలెత్తిన వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించు కునే వీలు ఉంటుందన్నారు. కుటుంబ వివాదాలు సామాజిక సమస్యలని, వాటిని మధ్యవర్తిత్వంతో శాశ్వత పరిష్కారం చేసుకోవాలని సూచించారు. సమాజంలోని అన్ని కమ్యూనిటీలకు చెందిన వ్యక్తులతో కమ్యూనిటీ మీడియేటర్లను ఏర్పాటు చేసి మధ్యవర్తిత్వ విలువలు, ప్రయోజనాలను తెలియజేస్తూ రాష్ట్రంలోనే మొట్టమొదటిసారి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.



మాట్లాడుతున్న హైకోర్టు జస్టిస్ సుజోయ్ పాల్

హైకోర్టు మరో న్యాయమూర్తి జె.శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పనిచేసే వారికి పరిస్థితులపై, సమస్యలపై అవగాహన ఉంటుందని.. కమ్యూనిటీ మీడియేటర్స్ రోల్ మోడల్‌గా నిలుస్తారన్నారు. జస్టిస్ శ్రీనివాస్‌రావు, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల ప్రధానన్యా యమూర్తులు సునీత కుంచాల, వరప్రసాద్, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి సీహెచ్ పంచాక్షరి, డాక్టర్ మహ్మద్ షమీమ్, గిరిబాలసింగ్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, జిల్లా అదనపు జడ్జీలు శ్రీనివాస్, ఆశలత, సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బాబు, జూనియర్ సివిల్ జడ్జీలు గోపీకృష్ణ, చైతన్య, హరికుమార్, శ్రీనివాసరావు, చీఫ్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ రాజ్‌కుమార్ సుబేదార్ తదితరులు పాల్గొన్నారు.

అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తాం

- ధరణి సమస్యల శాశ్వత పరిష్కారానికే నూతన చట్టం
- చర్చా వేదికలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పక్కన ఎమ్మెల్యే ధన్‌పాల్

నిజామాబాద్‌అర్బన్: నూతన రెవెన్యూ చట్టం -2024 ముసాయిదాపై వివిధ వర్గాల వారి అభిప్రాయాలను సేకరించేందుకు జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో శనివారం చర్చా వేదిక నిర్వహించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యానారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డితో పాటు న్యాయవాదులు, రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు, రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు హాజరై ముసాయిదా అంశాలపై సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. చర్చా వేదికలో వెల్లడైన అందరి అభిప్రాయాలను క్రోడీకరించి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. జిల్లా స్థాయిలోనూ మేధావులు, రెవెన్యూ చట్టంపై అవగాహన ఉన్న వారి అభిప్రాయాలను తెలుసుకోవాలనే ఉద్దేశంతో చర్చా వేదికను నిర్వహించినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు సైతం వారు గమనించిన అంశాలపై ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని సూచించారు.

చట్టాన్ని స్వాగతిస్తున్నాం


ఎమ్మెల్యేలు ధన్‌పాల్, రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం రూపొందించిన నూతన ముసాయిదా చట్టాన్ని స్వాగతిస్తున్నామన్నారు. క్షేత్రస్థాయిలో చట్టాలు పకడ్బందీగా అమలుకావాలన్నారు. గ్రామ స్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించాలని జిల్లా రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులు , రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు, ఆయా మండలాల తహసీల్దార్లు తమ అభిప్రాయాలను వెల్లడించారు. భూ సంబంధిత అంశాలతో కూడిన సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రత్యేక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసి, ఆర్డీవోలకు అప్పిలేట్ అథారిటీ అధికారం కల్పించాలని కోరారు. చర్చా వేదికకు హాజరైన రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులకు, న్యాయవాదులకు, రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధులకు, రైతులకు కలెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, ట్రెయినీ కలెక్టర్ సంకేత్, ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్‌నాయక్, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, అంబదాస్ రాజేశ్వర్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మణిహారంగా గడికోట

- వారసత్వ సంపద పరిరక్షణలో సంస్థానాధీశుల వారసుల సేవలు భేష్
- చర్చావేదికలో తెయూ రిజిస్ట్రార్ యాదగిరి

దోమకొండ: దోమకొండ గడికోట తెలంగాణ మణిహారంగా, వారసత్వ సంపదగా మిగిలిపోతుందని తెలంగాణ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ యాదగిరి పేర్కొన్నారు. శనివారం దోమకొండ గడికోటలో తెలంగాణ విశ్వవిద్యాలయం సౌత్ క్యాంపస్, దోమకొండ గడికోట ట్రస్టు సంయుక్తంగా తెలంగాణ చరిత్ర, వారసత్వం(ప్రాచీన కాలం నుంచి ప్రస్తుత కాలం వరకు) అనే అంశంపై చర్చా వేదిక నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి యాదగిరి మాట్లాడుతూ వారసత్వ సంపద పరిరక్షణలో దోమకొండ సంస్థానాధీశుల వారసుల సేవలను ప్రశంసించారు. గడికోటకు అవార్డు ఆఫ్ మెరిట్ విభాగంలో యునెస్కో అవార్డు లభించిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 287 చారిత్రక కట్టడాలకు సంబంధించి దరఖాస్తులు రాగా యునెస్కో దోమకొండ గడికోటను ఈ అవార్డుకు ఎంపిక చేసిందన్నారు. పురాతన కట్టడాల పరిరక్షణకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, దివంగత కామినేని ఉమాపతిరావ్, ఆయన కుమారుడు కామినేని అనిల్‌కుమార్ కృషి చేశారన్నారు. పలు ప్రాంతాల్లో నాటి రాజులు చేపట్టిన నిర్మాణాలు, వారు చేసిన సేవలపై చర్చా వేదికలో చర్చించారు.

రాష్ట్రంలోని సంస్థానాల పాత్ర అనే అంశంపై సిర్నాపల్లి సంస్థానాధిపతి డాక్టర్ అనురాధారెడ్డి మాట్లాడారు. బ్రిటిష్, నిజాం కాలంలో సంస్థానాలు ప్రజలకు ఏ విధంగా సేవలందించాయో వివరించారు. నాటి రాజుల కాలంలో వాడిన నాణేలు, కరెన్సీ నోట్లను అధ్యాపకుడు శ్రీగాధ శంకర్ వివరించారు. తెయూ సౌత్ క్యాంపస్ ప్రిన్సిపల్ సుధాకర్‌గౌడ్, ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సోషల్ సైన్సెస్ డీన్ ఘంటా చంద్రశేఖర్, వక్తలు ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆచార్యులు అడప సత్యనారాయణ, డాక్టర్ రాజిరెడ్డి, అంజయ్య, గడికోట ట్రస్టు సీనియర్ మేనేజర్ బాబ్జీ, కోడైరెక్టర్ అంజయ్య, ఆర్గనైజింగ్ సెక్రెటరీ నారాయణ గుప్తా, ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ వెంకట్‌రెడ్డి, పోతన్న, రమేశ్, కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయ్ కుమార్, ఎస్ఆర్ డిగ్రీ కాలేజ్ మేనేజింగ్ డైరెక్టర్ మారయ్యగౌడ్, ఆర్కే డిగ్రీ కాలేజ్ మేనేజింగ్ డైరెక్టర్ జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



పురాతన నాణేలను పరిశీలిస్తున్న అతిథులు

క్లుప్తంగా

విద్యా ప్రణాళిక లక్ష్యాలు సాధించాలి

■ డీఈవో దుర్గా ప్రసాద్‌



బోధన్‌: పాఠశాల విద్యార్థుల విద్యా సామర్థ్యాల పెంపుదలకు ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా ప్రణాళిక లక్ష్యాలు సాధించేందుకు కృషి చేయాలని డీఈవో దుర్గా ప్రసాద్‌ అన్నారు. పట్టణ కేంద్రంలోని డివిజన్‌ డీఈవో ఆఫీసులో శనివారం నిర్వహించిన డివిజన్‌ స్థాయి మండల నోడల్‌ ఆఫీసర్స్‌, కాంప్లెక్స్‌ స్కూల్‌ హెచ్‌ంల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలిమెట్టు, ఉన్నత విద్యా కార్యక్రమాలు పటిష్టంగా అమలు చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఉపాధ్యాయులు నిర్దేశిత సమయాన్ని పాటించి విధులు నిర్వర్తించాలని పేర్కొన్నారు. ఎంఈవో నాగ్‌నాథ్‌, మండల నోడల్‌ ఆఫీసర్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్‌ 1 నుంచి ప్రారంభం కానున్న ఉచిత శిక్షణ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్‌ సుంకం శ్రీనివాస్‌ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీసీటీవీ ఇన్‌స్టాలేషన్‌, సెల్‌ఫోన్‌ రిపేర్‌, ఏసీ రిపేర్‌ కోర్సులకు సంబంధించి శిక్షణకు (పురుషులకు మాత్రమే) దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. శిక్షణకు 19 నుంచి 45 ఏళ్ల వారు అర్హులన్నారు. ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాకు చెందిన గ్రామీణ యువకులు తమ ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఎస్సెస్సీ మెమో, ఐదు పాస్‌పోర్టు ఫొటోలతో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణతో పాటు భోజనం, హాస్టల్‌ వసతి ఉచితంగా ఉంటుందన్నారు. శిక్షణ పూర్తయిన అనంతరం ధ్రువీకరణ పత్రం, టూల్‌కిట్‌ అందజేస్తారని తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువకులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 08461–295428 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఆరో సెమిస్టర్‌ పరీక్ష ఫలితాలను విడుదల చేయాలి



తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలోని అప్లయిడ్‌ ఎకనామిక్స్‌, ఐఎంబీఏ, ఇంటిగ్రేటెడ్‌ ఫార్మాస్యూటికల్‌ కెమిస్ట్రీ, ఎల్‌ఎల్‌బీల ఆరో సెమిస్టర్‌ పరీక్షా ఫలితాలను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు శనివారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో తెయూ అడిషనల్‌ కంట్రోలర్‌ బి సాయిలుకు వినతిపత్రం అందజేశారు. పీజీ ఆరో సెమిస్టర్‌ పరీక్షలు పూర్తయి నెల రోజులు గడిచినా ఇప్పటి వరకు ఫలితాలను ఇవ్వలేదన్నారు. యూనివర్సిటీ అధికారులు వెంటనే పరీక్షా ఫలితాలను విడుదల చేసి సర్టిఫికెట్స్‌ అందజేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రిన్స్‌, దేవిక, రవీందర్‌, అక్షయ్‌, వంశీ, రాకేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక వేలం

రుద్రూర్‌: పోతంగల్‌ మండలంలోని రెండు ప్రాంతాల్లో స్వాధీనం చేసుకున్న ఇసుకను శనివారం తహసీల్‌ కార్యాలయంలో వేలం వేశారు. పోతంగల్‌ శివారులోని వీరభద్ర మందిరం సమీపంలో సుమారు 35 ట్రాక్టర్లు, కొడిచర్ల శివారులో పది ట్రాక్టర్ల ఇసుకను రెవెన్యూ అధికారులు సీజ్‌ చేశారు. దీనిని వేలంగా వేయగా పోతంగల్‌ గ్రామానికి చెందిన గందపు దత్తు రూ. 20వేలకు దక్కించుకున్నట్లు తహసీల్దార్‌ మల్లయ్య వెల్లడించారు.

రుణమాఫీ కోసం రైతన్నల భారీ ధర్నా

- ఏకకాలంలో రూ. 2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్‌
- ఆందోళనకు తరలివచ్చిన రైతాంగం

ఆర్మూర్‌: ఎలాంటి షరతులు లేకుండా రూ. రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్‌ చేస్తూ రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఆర్మూర్‌లోని మామిడిపల్లి వద్ద రోడ్డుపై రైతులు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ ధర్నాకు ఆర్మూర్‌, బాల్కొండ, నిజామాబాద్‌ రూరల్‌ నియోజకవర్గాల నుంచి రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మామిడిపల్లి రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



ఆర్మూర్‌లోని మామిడిపల్లి వద్ద ధర్నాలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న రైతులు, నాయకులు

ఆర్మూర్‌ రైతాంగం ఊరుకోదు



ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ఆర్మూర్‌ రైతాంగం ఊరు కోదు. హామీల అమలు కోసం ఉద్యమాలు చేపడుతుంది. ఎన్నికలకు ముందు రూ.49 వేల కోట్లు రైతుల రుణాలకు కావాలన్న సీఎం బడ్జెట్‌లో మాత్రం తక్కువ కేటాయించారు. రైతు ఉద్యమం రాష్ట్రం మొత్తాన్ని ప్రభావితం చేస్తుంది.

– వేముల ప్రశాంత్‌రెడ్డి, బాల్కొండ ఎమ్మెల్యే

సీఎం మాట మార్చారు



ఎన్నికలకు ముందు అధికారంలోకి వస్తే రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టాక మాటమార్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రూ. రెండు లక్షల రుణమాఫీని అమలు చేయాలి. లేదంటే రైతులతో కలిసి ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తాం.

– జీవన్‌రెడ్డి, ఆర్మూర్‌ మాజీ ఎమ్మెల్యే

కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు



సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ఆదాయం, ఖర్చులపై కనీస అవగాహన లేకుండా హామీలు ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం రైతాంగం పోరుబాట పట్టింది. ప్రభుత్వం స్పందించి రూ. రెండుల లక్షల రుణమాఫీని ఏకకాలంలోనే అమలు చేయాలి.

– బాజిరెడ్డి గోవర్ధన్‌, రూరల్‌ మాజీ ఎమ్మెల్యే

ఏకకాలంలో అమలు చేయాలి



ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రూ.రెండు లక్షల రుణ మాఫీని ఏకకాలంలో అమలు చేయాలి. అధికారం కోసం కాంగ్రెస్‌ రైతులను మోసం చేసింది. రైతులను మోసం చేస్తే బీజేపీ ఊరుకోదు. రైతుల తరఫున పోరాటం చేస్తూ మద్దతుగా నిలుస్తుంది. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే తగిన బుద్ధి చెబుతాం.

– పల్లె గంగారెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

కాంగ్రెస్‌వి అబద్ధపు ప్రచారాలు



కాంగ్రెస్‌ అబద్ధపు ప్రచారాలు చేసి ప్రజలను మోసం చేసింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే బీఆర్‌ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుంది. 20 శాతం మంది రైతులకే రుణమాఫీ అందింది. మిగతా రైతాంగానికి రుణమాఫీ అందక అల్లాడుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఏకకాలంలో రూ. రెండు లక్షల రుణమాఫీ అమలు చేయాలి.

– ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, బీజేపీ నాయకుడు

మాట తప్పిన సీఎం



ఆగస్టు 15లోగా రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీని అమలు చేస్తానన్న సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పారు. వచ్చే నెల 15లోగా ప్రతి రైతుకు రుణమాఫీ అమలు కావాలి. లేదంటే రైతు జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ రూపొందించి అసెంబ్లీని ముట్టడిస్తాం. ఉద్యమాలను తీవ్రతరం చేస్తాం.

– ప్రభాకర్‌, జేఏసీ నాయకుడు

మోర్తాడ్‌కు ఎన్‌సీసీ యూనిట్‌

- డిగ్రీ కళాశాలలో యూనిట్‌ ఏర్పాటుకు అధికారుల సుముఖత
- విద్యార్థులకు ఎంతో మేలు

మోర్తాడ్‌: మోర్తాడ్‌ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్‌ ఏర్పాటుకు జిల్లా అధికార యంత్రాంగం సుముఖత వ్యక్తం చేసింది. డిగ్రీ విద్యార్థులకు ఎన్‌సీసీలో సభ్యత్వం కల్పించి శిక్షణ ఇప్పించడానికి ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ టి పెద్దన్న రెండేళ్ల క్రితం జిల్లా అధికారులకు వినతిపత్రం అందించారు. ఇప్పటికే ఎన్‌ఎస్‌ఎస్‌ ఉంది. అందులో కేవలం సామాజిక కార్యక్రమాలను మాత్రమే నిర్వహిస్తున్నారు. ఎన్‌సీసీ యూనిట్‌ ఏర్పాటుతో విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. ఆర్మీ తరహాలో విద్యార్థులకు శిక్షణతో పాటు ప్రత్యేక యూనిఫాంతో ఏదైనా సభలు, సమావేశాలు, క్యాంపులకు భద్రత కల్పించే అవకాశం ఉంటుంది. త్రివిధ దళాల రిక్రూట్‌మెంట్‌లో ఉద్యోగాల కోసం ఎన్‌సీసీ సర్టిఫికెట్‌తో ప్రయత్నిస్తే ప్రత్యేక రిజర్వేషన్లు వర్తిస్తాయి. ఎన్‌సీసీ యూనిట్‌ను మంజూరి చేయాలనే ఉద్దేశ్యంతో ఇద్దరు అధికారులు కళాశాలను శుక్రవారం సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య ఇతర వివరాలను నమోదు చేసుకున్నారు. ఎన్‌సీసీ యూనిట్‌ ఏర్పాటుకు అనుకూలమైన వాతావరణం ఉండటంతో త్వరలోనే యూనిట్‌ ఆవిర్భావం జరుగుతుందని అధికారులు వెల్లడించారు. యూనిట్‌కు ఇన్‌చార్జీగా చరిత్ర అసోసియేట్‌ ప్రొఫెసర్‌ మర్రిపల్లి భూపతిని నియమించినట్లు ప్రిన్సిపాల్‌ తెలిపారు. మోర్తాడ్‌ లాంటి గ్రామీణ ప్రాంతంలో ఎన్‌సీసీ యూనిట్‌ ఏర్పాటు కానుండటంతో విద్యార్థుల తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కళాశాలను సందర్శించిన ఎన్‌సీసీ అధికారులు

ఉత్తమ డిపో మేనేజర్‌గా సాయన్న



ఖలీల్‌వాడి: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ఉత్తమ ఉద్యోగులకు 'ప్రగతి చక్రం' పురస్కారాలను శనివారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో అందజేశారు. నిజామాబాద్‌ –2 డిపో మేనేజర్‌ సాయన్న రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌, ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ చేతుల మీదుగా ఉత్తమ మేనేజర్‌ అవార్డును అందుకున్నారు.

క్రైం కార్నర్‌

అంత్యక్రియలకు వెళ్లి అనంతలోకాలకు..



రాహుల్‌(ఫైల్‌)

ఇందల్వాయి: అంత్యక్రియలకు వెళ్లి ఓ యువకుడు అనంతలోకాలకు వెళ్లిన ఘటన మండలంలోని సిర్నాపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై మనోజ్‌ శనివారం తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన పోగుల రాహుల్‌(19) అదే గ్రామానికి చెందిన బంధువు అంత్యక్రియల్లో పాల్గొని స్నానం చేసేందుకు మత్తడి వాగులోకి దిగాడు. ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఫిట్స్‌తో గుర్తు తెలియని వ్యక్తి ..



ఖలీల్‌వాడి: ఫిట్స్‌ రావడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నాందేవ్‌వాడ ప్రాంతంలో చోటుచేసుకుంది. మూడో టౌన్‌ ఎస్సై మహేశ్‌ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 21న నాందేవ్‌వాడ ప్రాంతంలో ఫిట్స్‌ వచ్చి రోడ్డుపై పడిపోవడంతో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. ఎవరైనా మృతుడి ఆచూకీ తెలిస్తే 8712659839 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

మద్యం తాగి తిట్టినందుకు హత్య



సిద్ధిరాం(ఫైల్‌)

మద్నూర్‌: మద్యం మత్తులో తమను తిట్టాడనే కోపంతో ఓ వ్యక్తిని ముగ్గురు హత్య చేసిన ఘటన మండలంలోని పెద్ద ఎక్లార గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై విజయ్‌కొండా, రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దానేవార్‌ సిద్ధిరాం(45)కు మద్యం తాగే అలవాటు ఉంది. మద్యం మత్తులో శనివారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన హన్మంత్‌, రాజు, సాయిలుని దూషించాడు. దీంతో వారు పశువుల కొట్టం వద్ద సిద్ధిరాం ఉన్నట్లు గుర్తించి రాత్రి కర్రలతో బాది హత్య చేశారు. మృతుడికి భార్య లలిత, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



గాంధారి: మండల కేంద్రంలో తాళం వేసిన ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై ఆంజనేయులు శనివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పత్తి శ్రీనివాస్‌ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం వేరే గ్రామానికి వెళ్లారు. అర్ధరాత్రి ఇంటికి వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు స మాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సే కరించారు. బీరువాలో ఉన్న 15 గ్రాముల బంగారం, 20 తులాల వెండి, కొంత నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆలయంలో చోరీకి యత్నం

నందిపేట్‌: మండల కేంద్రంలోని నందికేశ్వర ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీకి యత్నించిన వ్యక్తిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి ఆలయ గోడను దూకి ప్రధాన ద్వారం లోపలికి వెళ్లేందుకు యత్నించాడు. విషయాన్ని గమనించిన ఆలయ పూజారి ఆలయ కమిటీ సభ్యులతో పాటు గ్రామస్తులకు ఫోన్‌లో సమాచారం అందించాడు. వెంటనే వారు వచ్చి నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నిందితుడు మండలంలోని సీహెచ్‌ కొండూర్‌ గ్రామానికి చెందిన వ్యక్తిగా తెలిసింది.

బైక్‌ను ఢీకొన్న ఆటో

ఖలీల్వాడి: నగరంలోని బోర్గాం(పి) వద్ద బైక్‌ను ట్రాలీ ఆటో ఢీకొన్న ఘటనలో ఒకరి కాలు విరిగినట్లు నాలుగోటౌన్‌ ఎస్సై శ్రీకాంత్‌ శనివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మోపాల్‌ మండలం కులాస్‌పూర్‌ తండాకు చెందిన రవీందర్‌ తన భార్యతో బైక్‌పై జిల్లా కేంద్రానికి వస్తుండగా ఎదురుగా ఉన్న ఆటో అకస్మాతుగా తిప్పాడు. ఈ ఘటనలో రవీందర్‌ కాలిపై ఆటో ఎక్కడంతో కాలు విరిగింది. వెనుకాలే కూర్చున్న అతని భార్యకు సైతం గాయాలయ్యాయి. రవీందర్‌ సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉరేసుకొని ఒకరి ఆత్మహత్య



రాజిరెడ్డి(ఫైల్‌)

సదాశివనగర్‌: అప్పుల బాధతో ఒకరు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై రంజిత్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన తడిగెం రాజిరెడ్డి(41) ఇటీవల బతుకుదెరువు నిమిత్తం దుబాయికి వెళ్లి తిరిగి వచ్చాడు. దుబాయికి వెళ్లడానికి చేసిన అప్పులు పెరిగిపోవడంతో మానసిక వేదనకు గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

టిప్పర్ల పట్టివేత

ఎడపల్లి/ పిట్లం: ఎడపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ అనుమతి లేకుండా తరలిస్తున్న మూడు ఇసుక టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై వంశీదర్‌రెడ్డి శనివారం తెలిపారు. మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి తరలుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి మూడు టిప్పర్లను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పిట్లం మండలంలోని చిన్నకొడప్‌గల్‌ గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ఇసుక టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. అనంతరం ఇసుక టిప్పర్లను పీఎస్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, మొరం తరలిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

వచ్చే నెల 1నుంచి సభ్యత్వ నమోదు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు

సుభాష్‌నగర్‌: సంస్థాగత నిర్మాణంలో భాగంగా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మొదటి విడత సెప్టెంబర్‌ 1 నుంచి 25వరకు, రెండో విడత అక్టోబర్‌ 1 నుంచి 25వ తేదీ వరకు చేపట్టాలని మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు సూచించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌ కులాచారి అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో శనివారం సభ్యత్వ నమోదు కార్యశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ.. సభ్యత్వ నమోదును విజయవంతం చేసేందుకు ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు మండల స్థాయి, 31న పోలింగ్‌ బూత్‌స్థాయి కార్యశాలలు నిర్వహించాలని అన్నారు. 88000 02024 నంబర్‌కు మిస్డ్‌కాల్‌ ఇచ్చి బీజేపీ సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. దేశంలో అత్యధికంగా సభ్యత్వాలు ఉన్న పార్టీ బీజేపీ అని, ప్రతిఒక్క కార్యకర్త సభ్యత్వ నమోదులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు నిజామాబాద్‌ అర్బన్‌, ఆర్మూర్‌ ఎమ్మెల్యేలు ధన్‌పాల్‌ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డికి సభ్యత్వ నమోదుపై కీలక సూచనలు చేశారు. పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు పెద్దోళ్ల గంగారెడ్డి, నాయకులు న్యాలం రాజు, లక్ష్మీనారాయణ, గద్దె భూమన్న, శివరాజ్‌ కుమార్‌, మేక సంతోష్‌, శివప్రసాద్‌, గోపిడి స్రవంతిరెడ్డి, మండల అధ్యక్షులు, కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

- ఎస్బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐ ఉమ్మడి రాష్ట్ర డైరెక్టర్‌ విశ్వనాథ్‌రెడ్డి



శిక్షణ పొందుతున్న వారితో ఆర్‌ఎస్‌ఈటీఐ తెలుగు రాష్ట్రాల డైరెక్టర్‌ విశ్వనాథ్‌రెడ్డి

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): స్వయం ఉపాధి శిక్షణను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని స్టేట్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఆర్‌ఎస్‌ఈటీఐ) తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రాల డైరెక్టర్‌ విశ్వనాథ్‌రెడ్డి అన్నారు. డిచ్‌పల్లిలోని ఎస్బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐను శనివారం ఆయన సందర్శించారు. సంస్థ ఆధ్వర్యంలో ప్రస్తుతం కొనసాగుతున్న మగ్గం వర్క్‌, టైలరింగ్‌ శిక్షణను పరిశీలించి శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడారు. జీవితంలో స్థిరపడేందుకు స్వయం ఉపాధి శిక్షణ మంచి అవకాశమన్నారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది భాగ్యలక్ష్మి, రామకృష్ణ, రంజిత్‌, నవీన్‌, లక్ష్మణ్‌, జమున, రాధిక తదితరులు పాల్గొన్నారు.

పండిత్‌ వినీతకు డాక్టరేట్‌



డాక్టరేట్‌ అందుకుంటున్న పండిత్‌ వినీత

ఆర్మూర్‌: ఆర్మూర్‌ మున్సిపల్‌ మాజీ చైర్‌ పర్సన్‌ పండిత్‌ వినీత పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్‌ను శనివారం అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రంలోని గుంటూరులోని విజ్ఞాన్‌ యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సుప్రీం కోర్టు న్యాయమూర్తి పామిడి గంటం నరసింహం చేతుల మీదుగా పట్టాను అందుకున్నారు. వైర్‌లెస్‌ సెన్సార్‌లో మల్టీ-హాప్‌ రూటింగ్‌ కోసం ఎనర్జీ అండ్‌ డిస్టెన్స్‌ అవేర్‌ హైబ్రిడ్‌ ఆప్టిమైజేషన్‌ అల్గోరిథమ్‌పై ఆమె పరిశోధన గ్రంథాన్ని యూనివర్సిటీలో సమర్పించి డాక్టరేట్‌ను పొందారు.

ఆలూర్‌వాసికి..



మాద ప్రసాద్‌, డాక్టరేట్‌ గ్రహీత

పెర్కిట్‌: ఆలూర్‌ మండల కేంద్రానికి చెందిన సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌ మాద ప్రసాద్‌కు డాక్టరేట్‌ లభించింది. హైదరాబాద్‌లో చైతన్య డీమ్డ్‌ టు బి యూనివర్సిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో యూనివర్సిటీ చాన్స్‌లర్‌ సీహెచ్‌ వి పురుషోత్తం రెడ్డి ఈ సందర్భంగా ప్రసాద్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. హైదరాబాద్‌లోని క్యూబిక్‌ ట్రాన్స్‌పోర్టేషన్‌ సిస్టమ్స్‌ లిమిటెడ్‌ కంపెనీలో సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగిగా పని చేస్తున్న ప్రసాద్‌ 'స్టడీ ఆఫ్‌ ఎన్‌హాన్స్‌డ్‌ ఆట్రిబ్యూట్‌ బేస్డ్‌ ఎన్‌క్రిప్షన్‌ అండ్‌ క్రిప్టోగ్రఫీ మెథడ్స్‌ ఫర్‌ క్లౌడ్‌ కంప్యూటింగ్‌' అనే అంశంపై ప్రొఫెసర్‌ జగదీశ్వర్‌ పర్యవేక్షణలో పీహెచ్‌డీలో రీసెర్చ్‌ చేశారు. ఇందుకుగాను యూనివర్సిటీ వారు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. తమ గ్రామానికి చెందిన ఉద్యోగికి డాక్టరేట్‌ రావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ చీఫ్‌ అడ్మినిస్ట్రేటివ్‌ ఆఫీసర్‌ సీహెచ్‌ సాత్విక రెడ్డి, రీసెర్చ్‌ డీన్‌ టి క్రిస్టోఫర్‌ రుబెన్‌, రిజిస్ట్రార్‌ రవీందర్‌ తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌ వాసికి..



అవార్డుతో మీర్‌ జావిద్‌ అలీ

బోధన్‌: పట్టణ కేంద్రంలోని క్రిసెంట్‌ హైస్కూల్‌ ప్రిన్సిపాల్‌ మీర్‌ జావిద్‌ అలీకి రాష్ట్ర స్థాయి ప్రిన్సిపాల్‌ ఆఫ్‌ ఇయర్‌–2024 అవార్డు దక్కింది. విద్యారంగంలో అందిస్తున్న విశేష సేవలు, పలు అంశాల ప్రమాణికంగా హైదరాబాద్‌కు చెందిన యూనివర్సల్‌ మెంటర్స్‌ అసోసియేషన్‌ రాష్ట్ర స్థాయి ప్రైవేట్‌ విద్యా సంస్థలు, విద్యా సంబంధిత వివిధ విభాగాల నిర్వాహకులను అవార్డులకు ఎంపిక చేసి శనివారం అవార్డులను ప్రధానం చేసింది. ఇందులో క్రిసెంట్‌ హైస్కూల్‌ ప్రిన్సిపాల్‌ నిర్వాహకుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

క్షత్రియ కళాశాలలో న్యాక్‌ మదింపు పూర్తి



ప్రిన్సిపల్‌కు నివేదికను అందజేస్తున్న న్యాక్‌ టీం సభ్యులు

పెర్కిట్‌: ఆర్మూర్‌ మండలం చేపూర్‌ క్షత్రియ ఇంజినీరింగ్‌ కళాశాలలో రెండు రోజులగా నిర్వహిస్తున్న న్యాక్‌ మదింపు శనివారం పూర్తయింది. న్యాక్‌ పీర్‌ టీం చైర్మన్‌ ప్రొఫెసర్‌ వెంకటేశ్‌ రాయికర్‌ తన బృందంతో రెండు రోజులుగా పలు డిపార్ట్‌మెంట్లను పరిశీలించారు. కళాశాల చైర్మన్‌ అల్జాపూర్‌ శ్రీనివాస్‌, కార్యదర్శి అల్జాపూర్‌ దేవేందర్‌, ప్రిన్సిపల్‌ ఆర్‌కే పాండే కళాశాల ప్రధాన ప్రమాణాలపై పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ ద్వారా న్యాక్‌ బృందానికి వివరించారు. అనంతరం న్యాక్‌ బృందం కళాశాలలో రీసెర్చ్‌ అండ్‌ డెవలప్‌మెంట్‌ సెల్‌, ప్లేస్‌మెంట్‌ సెల్‌, అలుమ్ని సెల్‌, యాంటి ర్యాగింగ్‌ సెల్‌, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సెల్‌, గ్రీవెన్స్‌ కమిటీ, మైనార్టీ సెల్‌, ఉమెన్స్‌ కమిటీ, ప్రయోగశాలలు, మౌలిక సదుపాయాలు, వాటి గుణాత్మక పరితీరును పరిశీలించారు. అనంతరం పీర్‌ టీం చైర్మన్‌ వెంకటేశ్‌ రాయికర్‌ పూర్తి మదింపు నివేదికను కళాశాల ప్రిన్సిపల్‌కు అందజేశారు.

తునికి వద్ద రోడ్డు ప్రమాదం

■ ఒకరి మృతి, నలుగురికి తీవ్రగాయాలు



అశ్విని మృతదేహం

నిజాంసాగర్‌: మెదక్‌ జిల్లా కౌడిపల్లి మండలం తునికి గేట్‌ వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అశ్వినిబాయి(32) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. బిచ్కుంద మండలం చిన్నదడిగి గ్రామానికి చెందిన అశ్వినిబాయి బీరుగొండ దంపతులు తమ కుమార్తె సింధుజ ఆరోగ్యం బాగా లేకపోవడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. తిరుగు ప్రయాణంలో కారులో వస్తుండగా తునికి గేట్‌ వద్ద వీరి కారుతో పాటు మరో రెండు కార్లు ఒకదానికి వెనుక ఒకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో అశ్విని బాయి అక్కడికక్కడే మృతి చెందగా భర్త బీరుగొండ, కుమార్తె సింధూజ, కుమారుడితో పాటు కారు డ్రైవర్కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు నర్సాపూర్‌ పట్టణంలోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా వారు చికిత్స పొందుతున్నారు.

హైకోర్టు ప్రభుత్వ న్యాయవాదికి సన్మానం



ఖలీల్‌వాడి: రాష్ట్ర హైకోర్టు ప్రభుత్వ న్యాయవాది మహేశ్‌ రాజే శనివారం నిజామాబాద్‌ బార్‌ అసోసియేషన్‌ను సందర్శించారు. దీంతో మహేశ్‌ రాజేను బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు జగన్‌ మోహన్‌ గౌడ్‌ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. బార్‌ అసోసియేషన్‌ జిల్లా కోర్టు ఆవరణ పరిస్థితుల గురించి వివరించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వపరంగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్‌ అసోసియేషన్‌ కోశాధికారి అందెల దీపక్‌, మీడియేటర్లు బాలకృష్ణ, ఇంద్రాకు మారి, ఆసిఫ్‌, న్యాయవాదులు రాజ్‌కుమార్‌ సుబేదర్‌, డీసీ దాస్‌, చందక్‌, మంజిత్‌ సింగ్‌, శ్రీనివాస్‌, శుభం, ప్రమోద్‌ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తులకు ఘన స్వాగతం

ఖలీల్‌వాడి: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్‌ సుజోయ్‌ పాల్‌, జె.శ్రీనివాస్‌ రావు శనివారం జిల్లా పర్యటనకు హాజరైన సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులు వారికి ఘన స్వాగతం పలికారు. జిల్లా కోర్టు భవన సముదాయంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కాన్ఫరెన్స్‌ హాల్‌లో మూడు రోజుల పాటు కొనసాగిన కమ్యూనిటీ మీడియేటర్ల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి వారు హాజరయ్యారు. ముందుగా వారు స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌ హౌస్‌కు చేరుకుని పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా జడ్జి సునీత కుంచాల, కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు, ఆయా శాఖల జిల్లా అధికారులు, న్యాయశాఖ అధికారులు, న్యాయవాదులు, బార్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు హైకోర్టు జడ్జీలను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా జడ్జి, కలెక్టర్‌తో హైకోర్టు న్యాయమూర్తులు అతిథి గృహంలో కొద్దిసేపు భేటీ అయ్యారు.